సాక్షి అనకాపల్లి

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

వరి, చెరకు రైతులకు సూచనలు

అనకాపల్లి టౌన్: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విశాఖ, అనకాపల్లి జిల్లాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. వరి పొలంలో నిలిచిన నీటిని బయటకి తీసివేయాలని, వర్షాలకు పనలు తడిచి ఉంటే గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పుద్రావణం పిచికారీ చేయాలని లేదా ఎకరాకు 20 కిలోల ఉప్పు పనలపై జల్లుకోవాలని సూచించారు. చేను పడిపోయి కోతకు ఇంకా సమయం ఉన్నట్లయితే పంట పాడవకుండా రెండు, మూడు దుబ్బులు నిలగట్టి కలిపి కట్టుకోవాలన్నారు. సాంబ మసూరి వంటి రకం పక్వదశకు వచ్చి పంట తడిచినా మొలకెత్తుతుంది. వర్షం తగ్గిన వెంటనే 5 శాతం ఉప్పు ద్రావణం పంటపై పిచికారీ చేయాలన్నారు. భారీ వర్ష సూచన ఉన్నందున రబీ పంటలను విత్తుకోవడం రెండు రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. చెరకు పొలంలో నిలిచిన నీటిని బయటకి తీసివేసి, గాలులకు పడిపోయిన తోటలను లేపి నిలగట్టుకోవాలని ఆయన చెప్పారు. కాయగూరల పొలంలో నిలిచిన నీటిని బయటకు తీసివేసి, కాండం వేరు కుళ్లు తెగుళ్ల ఆశించకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు. పశువులు, కోళ్లు సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

తక్షణ సాయం కోసం.. కాల్ చేయండి

అనకాపల్లి టౌన్: తుపాన్ నేపథ్యంలో అన్ని మండలాల్లో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు కార్తీక స్నానాలకు నదులు, సముద్రతీరాలు, నదుల వద్దకు వెళ్లొద్దని, అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. తక్షణ సహాయం కోసం 100, 112, పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 9346912724ను సంప్రదించాలని ఆయన కోరారు.

మంచాల ప్రిన్సిపాల్‌కు అంతర్జాతీయ పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న వెంకటలక్ష్మి

చీడికాడ: మండలంలోని మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటలక్ష్మి తన వృత్తిపరంగా చేసిన కృషికిగాను పురస్కారాలు అందుకున్నారు. విద్య పట్ల నిబద్ధత, వినూత్న నాయకత్వానికి గుర్తింపుగా ఏపీ మోడల్ స్కూళ్ల నుంచి ఏకైక ప్రతినిధిగా ఆమె ఎంపికయ్యారు. ఈ మేరకు యునైటెడ్ స్టేట్స్‌లోని మేరి ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మలేషియా కౌలాలంపూర్‌లోని టేలర్స్ యూనివర్సిటీలో గత నెల 30న జరిగిన వరల్డ్ స్కూల్ సమ్మిట్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్పిరేషనల్ లీడర్ అవార్డు అందించారు. ఈ మేరకు వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈ గుర్తింపు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల మార్గదర్శకత్వమే కారణమని చెప్పారు.

వడ్డాది సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా

చోడవరం: ఈనెల 5వ తేదీన జరగాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ వాయిదా పడ్డాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో ఈనెల 5వ తేదీన సామాజిక సాధికార బస్సు యాత్ర జరిపేందుకు, వడ్డాదిలో బహిరంగ సభ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తుఫాను రావడంతో ఈ కార్యక్రమాలను వాయిదా వేసినట్టు ధర్మశ్రీ చెప్పారు. ఎప్పుడు జరుగుతుందనేది మళ్లీ ప్రకటిస్తామని తెలిపారు.

'మిచాంగ్'ను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- పలుచోట్ల నేలకొరిగిన వరి పైరు
- అధైర్యపడొద్దని వ్యవసాయాధికారుల భరోసా
- అచ్యుతాపురంలో 4.2 సెం.మీ అత్యధిక వర్షపాతం నమోదు





కోత కోసిన వరి చేను పరిశీలిస్తున్న అధికారులు, (ఇన్‌సెట్) నేలకొరిగిన వరిచేను

సాక్షి, అనకాపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. ఉదయం తేలిక పాటి జల్లులు, చలి గాలులతో ప్రారంభమై.. సాయంత్రానికి ఈదురు గాలులు జోరందుకున్నాయి. ప్రజలు చలిగాలులకు ఇళ్లకే పరిమితం అయ్యారు. జిల్లాలో ఎక్కడా ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గాని వాటిల్లలేదు. అధికార యంత్రాంగం ముందుగా అప్రమత్తమయింది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో అధికారులు తుపాను ప్రభావిత గ్రామాల్లో పర్యటించారు. జిల్లాలో ఉన్న 6 తీర ప్రాంత మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేకంగా అధికారులు వెళ్లి మత్స్యకారులకు తగు సూచనలు అందించారు. తీర ప్రాంతంలో తుపాను షెల్టర్లను, అవసరమైతే వినియోగించేందుకు పాఠశాలలను సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉంచారు. చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో పలు చోట్ల వరి చేనులు నేలకొరిగాయి. వరి పంటకు నష్టం వాటిల్లితే రైతులు అధైర్యపడొద్దని అధికారులు భరోసా కల్పించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రైతుల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తామని, వర్షాల వల్ల రైతులకు నష్టం జరిగితే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వర్షపునీటితో వరి పనలు తడిసిపోతే ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు.

జిల్లాలో వర్షపాతం ..

జిల్లా వ్యాప్తంగా సగటున 2 సెంటిమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం (సెం.మీ.లలో)
అచ్యుతాపురం	4.2
బుచ్చియ్యపేట	3.2
యలమంచిలి	3.1
ఎస్.రాయవరం, నక్కపల్లి	3.0
యలమంచిలి	2.9
అనకాపల్లి	2.7
నాతవరం	2.8
చోడవరం	2.6
మునగపాక, రాంబిల్లి, బుచ్చియ్యపేట, రావికమతం, మాడుగుల, కశింకోట	2.5
నర్సీపట్నం	2.4

అప్రమత్తంగా ఉన్నాం..

మిచాంగ్ తుపాను పట్ల అప్రమత్తంగా ఉన్నామని, అన్ని రకాల రక్షణ చర్యలూ చేపట్టామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పేర్కొన్నారు. తుపాను అప్రమత్తతపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుపాను సన్నద్ధతను వివరించారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు, సమాచారం అందించేందుకు ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు, 52 శాశ్వత, తాత్కలిక పునరావాస కేంద్రాలు, మౌలిక వసతులు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో కోస్టల్ మండలాలు 6, వరద ముంపు మండలాలు 18గా గుర్తించామని, పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు పంటను తరలించామని, కోతలను వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించినట్లు వివరించారు. విద్యుత్ పరమైన సమస్యలు రాకుండా 500 మందికి పైగా సిబ్బందిని అందుబాటులో ఉంచామని, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు విపత్తు నిర్వహణ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఇతర అధికారులు

నష్టాలకు తావు లేకుండా..

తుపాను నేపథ్యంలో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మిచాంగ్ తుపాను జిల్లాపై ప్రభావం చూపే అవకాశం ఉందని, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. విపత్తు ముగిసిన వెంటనే పునరుద్ధరణ కార్యక్రమాల నిర్వహణకు మండల స్థాయిలో బృందాలను నియమించాలని చెప్పారు. రహదారులపై చెట్లు కూలితే తక్షణమే తొలగించడానికి కటింగ్ యంత్రాలు, జేసీబీలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు బృందాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలలో వైద్య శిబిరాలు, ఇతర వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ సహా జిల్లా అధికారులంతా పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు నిరంతర విద్యుత్

- తుపాన్ షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం



సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, 5 సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనల్ని సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియచేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల ఎస్‌ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్‌ఈల్ని ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమండ్రి సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, వాట్సాప్ నెంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని సూచించారు.


కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు

టోల్ ఫ్రీ నెంబర్	1912
కార్పొరేట్ కార్యాలయం	94408 16373
విశాఖపట్నం	73822 99975

ముందస్తు హెచ్చరికలతో వరి రైతులు అప్రమత్తం

చోడవరం రూరల్: వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రకృతి విపత్తుల శాఖ, వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగం చేసిన ముందస్తు హెచ్చరికలు ఖరీఫ్ వరి రైతులను ఎంతగానో ఆదుకున్నాయి. మిచాంగ్ తుపాను రానున్నదని కోతకు వచ్చిన వరిపంట ఉంటే ఇపుడపుడే కోతకు వెళ్లరాదని, ఇది వరకే కోతకోసి ఉంటే తక్షణం వరిపంటను ఒడ్డుకు తెచ్చుకునే ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్న సంగతి తెలిసిందే. అయితే ఆదివారం అర్ధరాత్రి వరకు ఎలాంటి వర్షసూచన లేకున్నప్పటికీ సోమవారం తెల్లవారిన దగ్గరి నుంచి తుపాను అనకాపల్లి జిల్లా రైతాంగాన్ని పలకరించింది. అయితే వరి రైతులను ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం చేయడంతో ఎలాంటి ఆందోళనకు గురికాలేదు. చోడవరం మండలంలో సుమారు నాలుగువేల ఎకరాలలో వరి సేద్యం చేశారు. దీంట్లో కొంత భాగం ఇది వరకే కోతలు పూర్తయ్యాయి. అయితే అధిక శాతం వరి పంట నేడు పక్వానికి వచ్చి కోతకు సిద్ధం అయ్యింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. ఎలక్ట్రానిక్ మాధ్యమంలోను, వాట్సప్ మెసేజ్‌లతోను సచివాలయాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతాంగాన్ని ముందస్తుగా సంసిద్ధం చేయడం ఈ ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితిలో అష్టకష్టాలు పడి పండించిన వరిపంటను నిలబెట్టుకున్నట్టయ్యింది.

శుక్రవారం కోత పెట్టాలనుకున్నా



నేను ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఎకరం సొంత పొలం, మరో ఎకరం కౌలు పొలంలో వరి పంట వేశాను. సాగునీటి ఇబ్బందుల కారణంగా బోరువెల్ ఆధారంగా ఈ పంటను పండించాను. చీడపడలు ఆశిస్తే పురుగు మందుల స్ప్రే చేయడమే పెద్ద భారంగా మారింది, ఏదో రీతిలో పంట చేతికి వస్తుందనగా శుక్రవారం కోతకు సిద్ధమయ్యాను. అయితే తీవ్ర తుపాను వస్తుందన్న హెచ్చరికలతో కోతను వాయిదా వేసుకున్నాను. సోమవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా నాకు ఆందోళన లేదు. మరో నాలుగురోజుల తర్వాతైనా నా పంట చేతికి వస్తుందన్న ఆశ ఉంది.

–బొడ్డేడ మహాలక్ష్మినాయుడు, వరి రైతు, అడ్డూరు

సమన్వయంతో సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల/చీడికాడ: మిచాంగ్ తుపాను ముంచుకొస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం ఆయన మాడుగుల ఎంపీడీవో, చీడికాడ తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని వరి పనలు సురక్ష ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లను రక్షణగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదకర, గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు చేయడం మానుకోవాలన్నారు. గ్రామ, మండల స్థాయి అధికార యంత్రాంగమంతా స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, విద్యుత్, పోలీసు, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఎక్కడ నష్టం జరిగినా వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పండిన వరి చేలు తీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్ళపు రెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, ఎంపీడీఓ మీనాకుమారి, తహసీల్దార్ పీవీరత్నం, చీడికాడ తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాస్, వైఎస్సార్ సీపీ చీడికాడ మండల అధ్యక్షుడు గొళ్ళవిల్లి రాజబాబు, ఎంపీపీ కురచా జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో అలజడి



పూడిమడకలో ముందుకొస్తున్న కెరటాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో అచ్యుతాపురం మండలంలోని తంతడి, పూడిమడక తీర ప్రాంతాల్లో అలజడి రేగుతోంది. ఆదివారం సాయంత్రం గాలులు తీవ్రత పెరగగా, కొద్ది పాటి జల్లులు సోమవారం నాటికి మరింత పెరిగింది. తుపాను తీవ్రత పెరిగి తమిళనాడులో బీభత్సం సృష్టిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ వైపు పయనిస్తూ మంగళవారం ఉదయం తీరం దాటే ప్రాంతాలపై వాతావరణ శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉండడంతో పాటు, గాలుల మరింత వేగంగా వీచే అవకాశం ఉన్నందున మెరైన్ పోలీసులు, రెవెన్యూ విభాగం పూడిమడక, తంతడి గ్రామాలపై దృష్టి సారించారు. సోమవారం పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ సోమవారం రాత్రి నుంచి పరిస్థితి ఏ మేరకు విషమిస్తుందో అన్న ఆందోళన అందరిలోనూ వ్యక్తమైంది. మత్స్యకారులు ఇళ్లకే పరిమితం అయ్యారు. బోట్లను ఒడ్డున లంగర్ వేసిన మత్స్యకారులు వలలను సైతం మూటగట్టి భద్రపరిచే పనిలో పడ్డారు. శిథిల భవనాల వద్ద ఎవరూ ఉండవద్దని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సీఐ మురళీరావు తంతడిలో పర్యటించి, మెరైన్ కానిస్టేబుళ్ల తీర ప్రాంతంలో పహరా ఉంచారు. పూడిమడకలోనూ పరిస్థితిపై ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. సముద్రంలో అల్లకల్లోలంగా ఉండడం, కెరటాలు ఉవ్వెత్తున లేస్తుండడంతో మత్స్యకారులు భయంతో ఉన్నారు.

జర్నీకి బ్రేక్

- ఇప్పటికే 80కి పైగా రైళ్ల రద్దు
- నేడు 19 విమాన సర్వీసులూ క్యాన్సిల్
- బస్సుల రద్దుపై వేచిచూస్తున్న ఆర్టీసీ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం ప్రయాణికులపై పడింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి ప్రయాణాలకు బ్రేకులు వేసింది. చెన్నై నుంచి విశాఖపట్నం వరకు తుపాను ప్రభావం ఉండనుంది. దీని ధాటికి భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా తమిళనాడుతో పాటు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కుంభవృష్టి కురుస్తోంది. మరో రెండ్రోజులు భారీ వర్షాలు కొనసాగనున్నాయి. ఫలితంగా రైల్వే ట్రాక్‌లు వరద నీటిలో చిక్కుకోవడం గాని, కొట్టుకుపోవడం గాని జరిగే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యగా రైల్వే శాఖ తమిళనాడు నుంచి విశాఖపట్నం వైపు వచ్చే, విశాఖ మీదుగా విజయవాడ, తమిళనాడు వైపు వెళ్లే దాదాపు 80కి పైగా ఎక్స్‌ప్రెస్, పాసింజరు రైళ్లను ఇప్పటికే రద్దు చేసింది.

దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలను రద్దు చేసుకోవలసి వచ్చింది. మళ్లీ ఏడో తేదీ నుంచి రద్దయిన రైళ్లను దశల వారీగా పునరుద్ధరించనున్నారు. మరోవైపు ప్రతికూల వాతావరణంతో 19 విమాన సర్వీసులు క్యాన్సిల్ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం–చెన్నై, విశాఖపట్నం–హైదరాబాద్, విశాఖపట్నం–విజయవాడ, విశాఖపట్నం–తిరుపతి, చెన్నై– విశాఖపట్నం, హైదరాబాద్–విశాఖపట్నంల మధ్య నడిచే విమానాలను రద్దు చేశారు. విశాఖ నుంచి ఇండిగో విమానాలన్నీ మంగళవారం రద్దయ్యాయి.

వేచి చూస్తున్న ఆర్టీసీ

సాధారణంగా రైళ్లు రద్దయినప్పుడు ఆ ప్రభావం బస్సులపై పడుతుంది. కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. రైళ్లకు బదులు బస్సుల్లో దూర ప్రాంతాలకు వెళ్లడానికి జనం ఆసక్తి చూపించడం లేదు. తుపాను తీవ్రత తగ్గాకే వెళ్లవచ్చన్న భావనతో వీరు తమ ప్రయాణాలను తాత్కాలికంగా రద్దు చేసుకున్నారు. మరోవైపు తీవ్ర తుపాను కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు తమ దూరప్రాంత సర్వీసులను సోమవారం రాత్రి వరకు నడిపారు. ప్రధానంగా తుపాను ప్రభావం రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రపై చూపుతోంది. విశాఖ నుంచి కడప, తిరుపతి, ప్రొద్దుటూరు, కర్నూలుతోపాటు విజయవాడ, గుంటూరు, భీమవరం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. మంగళవారం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏపీ సర్వీసులను ఎక్కడ వరకు నడపాలన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ఆరిపోయిన ఇంటి దీపాలు

- పుణ్యస్నానాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్న ఇద్దరు మహిళలు
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

కశింకోట : కార్తీక మాసం..మూడో సోమవారం ..సూర్యోదయానికి ముందే నదీ స్నానం చేసి, నీటిలో దీపాలు వెలిగించాలన్నది ఆ మహిళల ఆశ. కానీ మృత్యువు ఊబి రూపంలో ముంచుకొస్తుందని వారు ఊహించలేదు. పేరంటాలపాలెం శివారు జోగారావుపేటకు చెందిన ఐదుగురు మహిళలు ఉదయం 5 గంటల ప్రాంతంలో పక్కనున్న శారదా నదికి వెళ్లారు. స్నానాలు ఆచరించారు. వారిలో ఆరట్ల మంగ (37) నదిలో అరటి డొప్పపై వత్తులు వేసి దీపాలు వెలిగించారు. నదిలో వదిలారు. దాన్ని ప్రవాహంలోకి తోయడానికి ముందుకు వెళ్లి నదిలో ఊబి కానక ఈత రాక మునిగిపోసాగారు. ఈ విషయాన్ని గమనించిన మారపురెడ్డి లక్ష్మి (57), బొద్దపు నూకరత్నం, జగది భవానీ లక్ష్మి, కన్నూరు యామిని చేయందించి, ఆమెను రక్షించేందుకు ప్రయత్నించారు. దీంతో లక్ష్మి, యామినిలు కూడా నది ఊబిలో పడిపోయారు. వీరిని రక్షించడానికి చున్నీ విసిరి యామినిని భవాని, నూకరత్నం రక్షించారు. లక్ష్మి, మంగలను రక్షించడానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో మిగిలిన వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంగ, లక్ష్మిలను వెలికి తీయగా అప్పటికే వారు మృతి చెందినట్టు గుర్తించారు. వీరి మృతితో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మృతురాలు లక్ష్మిది వ్యవసాయ కుటుంబం కాగా భర్త నాగేశ్వరరావు, కుమార్తె మైథిలి, కుమారుడు హేమ సుందర్ ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం చేశారు. మరో మృతురాలు మంగ కూలీ. కుమార్తెలు వర్ధిని, సునీత చదువుకుంటున్నారు. ఆడ పిల్లలమైన తమ ఆలనా పాలనా ఇక ఎవరు చూస్తారంటూ వారు రోదిస్తున్నారు. సీఐ ఎ.రవికుమార్ పర్యవేక్షణలో అదనపు ఎస్ఐ జె. నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఆరట్ల మంగ, మారపురెడ్డి లక్ష్మిల మృతదేహాలు (ఇన్‌సెట్) మంగ (ఫైల్), లక్ష్మి (ఫైల్)

ఇంటర్ విద్యార్థులకు బంపర్ ఆఫర్

- ప్రతిభ చూపిన వారికి ఐటీ కొలువు
- ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు
- అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కాలేజీలకే రానున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు
- ఈ నెల 20న హెచ్‌సీఎల్ టెక్–బీ పరీక్ష



విశాఖలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్‌తోనే ఐటీ కొలువులు దక్కించుకోవచ్చు. ఉద్యోగం చేస్తూనే పేరొందిన యూనివర్సిటీల్లో డిగ్రీ, ఆ పైకోర్సులను చదువుకోవచ్చు. హెచ్‌సీఎల్ టెక్–బీ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించనుంది. ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలతో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాలేజీలకే వచ్చి నైపుణ్యం గల విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి, ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. ఇప్పటివరకు డిగ్రీ, పీజీ కోర్సులు చేసిన వారికే ఇలాంటి అవకాశం దక్కుతుండగా, తాజాగా ఇంటర్ విద్యార్థులకు సైతం చక్కటి అవకాశం లభించనుంది.

16లోగా దరఖాస్తు చేసుకోవాలి : ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. https://bit.ly/TechbeeGoAP వెబ్‌సైట్‌లో విద్యార్థుల పూర్తి వివరాలను నమోదు చేసి ఈ నెల 16లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థులు మూడు దశల్లో పరీక్షలు రాయాలి. అర్హత సాధించిన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున స్టైఫండ్ ఇస్తారు. అనంతరం మంచి వేతనంతో కూడిన ఉద్యోగం దక్కనుంది.

ఫోన్లలో పరీక్ష రాసే అవకాశం : విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులకు ఈ నెల 20న, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 22న పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఆన్‌లైన్ కాట్ టెస్టు పేరిట నిర్వహించే ఈ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదివే విద్యార్థులంతా అర్హులే.

ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు: ఇంటర్ బోర్డుతో హెచ్‌సీఎల్ టెక్–బీ సాఫ్ట్‌వేర్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు విద్యార్థులకు ఇటువంటి అరుదైన అవకాశం లభించనుందని ఆర్ ఐవో రాయల సత్యనారాయణ చెప్పారు. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపు విద్యార్థులకు ఐటీ రంగంలోనూ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారికి అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఎంపికైన విద్యార్థులు ఉద్యోగం చేసుకుంటూనే డిగ్రీ, ఆ పైస్థాయి కోర్సులను చదువుకోవచ్చు. కోర్సు ఫీజులో ఏడాదికి రూ.15 వేలకు తక్కువ కాకుండా హెచ్‌సీఎల్ కంపెనీ చెల్లించనుంది.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీ


యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలోని రామచంద్రమ్మ కొండపై వెలసిన స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగింది. ఈ ఆలయంలో స్టీల్, సిల్వర్ హుండీలు ఉన్నాయి. అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆదివారం సాయంత్రం ఆలయంలో పని ముగించుకుని గేటుకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హెక్సా బ్లేడుతో ఆలయం గేటుకు వేసిన తాళాన్ని కోసి లోనికి ప్రవేశించి స్టీలు హుండీని అపహరించుకుపోయారని పట్టణ ఎస్ఐ కె.సాపినాయుడు తెలిపారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యుడు శెలంశెట్టి సూర్యప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతుండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో ఏర్పాటు చేసిన హుండీ చోరీకి గురైందని ఎస్ఐ చెప్పారు. హుండీలో సుమారుగా రూ.3వేలకు పైగా నగదు ఉండొచ్చని కమిటీ సభ్యుడిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పట్టణంలో దొంగలు, ఆకతాయిల ఆగడాలు

ఇటీవల పట్టణంలో తరచుగా చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండ్రోజుల క్రితం పెదపల్లికి చెందిన ఓ రైతు బ్యాంకు నుంచి డ్రా చేసిన నగదులో గుర్తు తెలియని యువకుడొకరు రూ.4 వేలు తస్కరించాడు. కొద్దిరోజుల క్రితం బస్టాండుకు సమీపంలో పోస్టాఫీసు వద్ద నడిచి వెళ్తున్న ఓ వ్యాపారిని ఏమార్చి అతని మొబైల్ ఫోన్‌ను లాక్కొని ద్విచక్రవాహనంపై ఉడాయించారు ఇద్దరు యువకులు. గొల్లప్రోలు ఆస్పత్రి వెనుక భాగంలో ఓ ఇంట్లో రూ.4 లక్షల విలువైన డిజిటల్ కెమెరాలు చోరీకి గురయ్యాయి. బస్ కాంప్లెక్స్ వద్ద కొందరు పోకిరీలు విద్యార్థులను బెదిరిస్తున్నారు. అకారణంగా విద్యార్థులతో గొడవలు పెట్టుకుంటూ అప్పటికే డ్యామేజైన మొబైల్ ఫోన్లను కింద పడేసుకుని వాటికి డబ్బు డిమాండ్ చేయడం, విద్యార్థులపై చేయి చేసుకోవడం చేస్తున్నారు. పట్టణ పోలీసులు మఫ్టీలో బస్ కాంప్లెక్స్ వద్ద సాయంత్రం కళాశాలలు విడిచిపెట్టే సమయాల్లో కాపలా కాసి పోకిరీల ఆగడాలను అడ్డుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- నేడు దిమిలిలో బురదమాంబ జాతర
- బురద పూసుకొని కేరింతలు కొట్టనున్న జనం
- మహిళలకు మినహాయింపు

ఒళ్లంత.. బురదంత... కావాలిలే...


బురదమాంబ అమ్మవారు


వేపకొమ్మలను సిద్ధం చేస్తున్న యువకులు


బురద జాతర దృశ్యాలు

రాంబిల్లి: ఒళ్లంత.. బురదంత .. కావాలిలే.. అంటూ యువకులు బురద పూసుకుని కేరింతలు కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇదో విచిత్రమైన పండగ.. అదే బురదమాంబ జాతర.. స్పెయిన్‌లో టమాటాల్లో పడి పొర్లాడినట్టు రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో బురద పూసుకుని సందడి చేయనున్నారు. ఇక్కడ మంగళవారం వేకువజాము 3 నుంచి ఉదయం 10 గంటల వరకు బురదమాంబ జాతర సాగనుంది. జాతర రోజు గ్రామంలో ఉంటే ఎంతటివారైనా బురద పూయించుకోవాల్సిందే. ఇందులో మహిళలకు మాత్రం మినహాయింపు ఉంటోంది.

ఎంతటి స్థాయి వ్యక్తి అయినా వయస్సుతో సంబంధం లేకుండా మగవారైతే పాల్గొంటారు. ఇదో వింత పండగ.. దల్లమాంబ జాతర అనుపు ఉత్సవంలో భాగంగా ఈ జాతరను నిర్వహిస్తారు. వేపకొమ్మలను మురుగు కాలువల్లో ముంచి అందులో బురదను ఒకరిపై ఒకరు పూసుకొని కేరింతలు కొడతారు. గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఈ జాతర డప్పుల శబ్దాల నడుమ ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారు. జాతర అనంతరం ఆయా కొమ్మలను అమ్మవారి ఆలయం వద్ద ఉంచి పూజలు చేస్తారు.

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, భక్తుల కొంగు బంగారంలా బురదమాంబ అమ్మవారిని భక్తులు కొలుస్తారు. బురద పూసుకున్న వారికి ఎటువంటి చర్మవ్యాధులు సోకకపోవడంతో అమ్మవారి మహాత్యంగా నమ్ముతారు.

బురదలో విగ్రహం లభ్యం కావడంతో...

బురదమాంబ విగ్రహం బురదలో లభ్యం కావడంతో బురదమాంబగా అమ్మవారికి నామకరణం చేసి దశాబ్దాలుగా కొలుస్తున్నారు. ఈ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు బంగారు చిలుకు, నగిరెడ్డి మురళీకృష్ణ తెలిపారు.

బురద జాతర ఎంతో ప్రత్యేకం



రెండేళ్లకోసారి నిర్వహించే బురద జాతర ఎంతో ప్రత్యేకమైనది. బురద పులుముకుంటూ, కేరింతలు కొడుతూ చేసే నృత్యకేళిలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. జాతరలో వినియోగించే వేపకొమ్మలను సిద్ధం చేసుకున్నాం.
–దబ్బీరు రాము, గ్రామ వలంటీరు

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా వెంకట అప్పారావు



అచ్యుతాపురం (అనకాపల్లి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్‌గా అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వెంకట అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన కూచిపూడి నృత్య పోటీలు


విజేతలతో దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: స్థానిక నిదానందొడ్డి కామాక్షమ్మ ఆలయ ఆవరణలో ఉమ్మడి విశాఖ జిల్లా కూచిపూడి నృత్య పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ హాజరై విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి నృత్య పోటీలు పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు. పోటీల్లో 160 మంది పాల్గొన్నట్లు చెప్పారు. కూచిపూడి సబ్ జూనియర్ విభాగంలో ప్రథమస్థానం పి.పరాస్మి(విశాఖ), ద్వితీయస్థానం డి.యాషిక(గాజువాక), తృతీయ స్థానం వి.లాస్యశ్రీ(విశాఖ శ్రీహరిపురం), జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం కె.నిత్య(చోడవరం), ద్వితీయ స్థానం వై.మహంతి, తృతీయ స్థానం, గీతిక(సింధియా)తో పాటు మరికొంతమందికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి నృత్య పోటీల నిర్వాహకుడు, అబ్దుల్ కలాం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్ కుమార్, సభ్యులు కొణతాల రాజు, తరుణి వాణి, చింతా లక్ష్మాజీ, ఇంటి త్రినాథ్, బుద్ద స్పందన పాల్గొన్నారు. పోటీల న్యాయనిర్ణేతలుగా యడ్ల గీతాగాయిత్రి, ప్రసన్నలక్ష్మీ వ్యవహరించారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీల స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి



ఎస్పీ కార్యాలయంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల : జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు స్పందన కార్యక్రమంపై పూర్తి నమ్మకం ఉందని, అనేక అర్జీలు స్పందనలో వస్తున్నాయన్నారు. ప్రతి సమస్యపై క్షేత్ర స్థాయి విచారణ చేపట్టి ఫిర్యాదుదారుకు స్పష్టమైన రీతిలో సమాధానం ఇవ్వాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనకు 176 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డులకు సంబంధించిన వినతులు ఉన్నాయి. ఎస్‌డీసీ డాక్టర్ ఎ.మహేష్, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ దరఖాస్తులను స్వీకరించారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బెనిఫిట్‌లు ఇవ్వడంతో పాటు పీఆర్సీ పెంచి మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి కోట లక్ష్మణ కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయరూ...

ల్యాండ్ పూలింగ్‌లో పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలం కర్నెకలంక గ్రామానికి చెందిన గిరిజన మహిళ పాంగి దేముడమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తన భర్త మాజీ నక్సలైట్ అయినందున తమకు అనకాపల్లి మండలం కుంచంగి గ్రామంలో సర్వే నెం.318/5లో 5 ఎకరాలు భూమి ప్రభుత్వం గతంలో ఇచ్చిందని, ల్యాండ్ పూలింగ్‌లో ఈ భూమిని ప్రభుత్వం తీసుకుందని ఆమె తెలిపింది. ప్రత్యామ్నాయంగా మాకు కేటాయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఆమె కోరింది.

ఎస్పీ కార్యాలయంలో 31 అర్జీలు..

అనకాపల్లిటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 31 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీటింగ్, భూతగాదాలు, కుటుంబ కలహాలు వంటి వాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిలా అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయ్‌భాస్కర్, జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్ ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి(45) మృతి చెందాడు. సోమవారం ఉదయం ఇక్కడ రైల్వే ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది తుని రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు తుని ప్రభుత్వ పీఎస్ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిశీలించారు. రంగు గళ్లతో హాఫ్ చేతుల చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించిన వ్యక్తి గుండు గీయించుకుని ఉండటంతో ఆదివారం అన్నవరం దేవస్థానం నుంచి వస్తూ యలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి శవాగారంలో భద్రపరిచినట్టు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబీకులు 9494887786, 9490619020 సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని మతిస్థిమితం లేని మహిళ మృతి

మాకవరపాలెం: గుర్తు తెలియని కారు ఢీకొని మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. స్థానిక ఆంధ్రాబ్యాంకు ఎదుట ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని కారు ఆమెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నాని ఎస్ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- వెదుళ్లపాలెం హైవేలో డ్రైవర్ దుర్మరణం




వ్యాన్‌ను ఢీకొట్టి సైడుకాలువలోకి పల్టీలు కొట్టిన ట్రావెల్ బస్సు (ఇన్‌సెట్) పైడితల్లి (ఫైల్)

నక్కపల్లి: మండలంలోని వెదుళ్లపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మరణించాడు. ఎస్ఐ విభీషణ్‌రావు వివరాల ప్రకారం... తుని నుంచి నక్కపల్లి వైపు వస్తున్న లారీని వెదుళ్లపాలెం సమీపంలో డ్రైవర్ నిలిపి టైర్లలో గాలి పరిశీలిస్తుండగా.. వెనుక నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆగి ఉన్న లారీ డ్రైవర్ విజయనగరం జిల్లా గుర్ల మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన దొప్పా పైడితల్లి(45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు సహాయక చర్యలు చేపడుతున్న సమయంలో హైదరాబాద్ నుంచి వస్తున్న మరో ప్రైవేటు ట్రావెల్ బస్సు తన ముందున్న పాల వ్యాన్‌ను ఢీకొట్టి పక్కనే సైడు కాలువలోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణికులంతా ప్రాణాలతో బయటపడ్డారని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనలపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి వ్యాపారి అరెస్టు

- 160 కిలోల గంజాయి స్వాధీనం

రోలుగుంట: మండలంలోని గైరంపేట-రత్నంపేట మార్గంలో కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది గంజాయి వ్యాపారులపై సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా రత్నంపేట శివారు ఏడు గోనె సంచులతో వాహనం కోసం ఎదురు చూస్తున్న నిందితుడిని పట్టుకున్నాడు. రత్నంపేటకు చెందిన అతడిని అదుపులోకి తీసుకుని 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

హర హర మహాదేవ శంభోశంకర..


దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామికి పూజలు

రాంబిల్లి: కార్తీక మూడో సోమవారం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పవిత్రమైన ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్షేత్రపాలకుడైన ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంతోపాటు పలు గ్రామాల్లో శివాలయాల్లో కార్తీక మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేశారు. పలువురు ఉపవాస దీక్ష పాటించారు.

ఉగ్గబట్టుకోవాల్సిందే..

- కాగిత టోల్‌ప్లాజాలో సమస్యలు తిష్ట
- మరుగుదొడ్లకు నోచుకోని వాహన చోదకులు
- లక్షల్లో ఆదాయం.. కానరాని సదుపాయాలు
- యాజమాన్య నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు


కాగిత వద్ద టోల్‌ప్లాజా

నక్కపల్లి: నిత్యం టోల్ రూపంలో లక్షల్లో ఆదాయం.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కనీస సదుపాయాలు కానరాలేదు. అత్యవసరమైతే ఉగ్గబట్టుకోవాల్సిందే.. రోడ్డు ప్రమాదాలకు గురైతే సకాలంలో చేరని హైవే అంబులెన్స్.. వెరసి జాతీయ రహదారిలో కాగిత టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికుల అగచాట్లు వర్ణనాతీతంగా మారాయి. యాజమాన్య నిర్లక్ష్య వైఖరి కారణంగా ఒక వైపు మార్గంలో అరకొరగా సేవలందుతున్నా, రెండో వైపు మార్గంలో పూర్తిగా సేవలను విస్మరించిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాతీయ రహదారిని ఆరు లైన్లగా విస్తరించిన తర్వాత దాదాపు 15 ఏళ్ల క్రితం నక్కపల్లి మండలం కాగిత సమీపంలో టోల్ ప్లాజా ఏర్పాటు చేశారు. టీవోటీ (టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంతో ఏర్పాటైన ఇక్కడ పది బూత్‌లు ఉన్నాయి. ఒక వైపు వాహనం ప్రయాణిస్తే రూ.130 నుంచి రూ.650 వరకు ఫీజు వసూలు చేస్తారు. తద్వారా నిత్యం టోల్‌గేట్‌కు రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. గతంలో మూడు షిఫ్టులకు 75 కార్మికులు, సూపర్‌వైజర్లు ఉండగా, ప్రస్తుతం 30 మంది మాత్రమే పనిచేస్తున్నారు.

పాడైన కంటైనర్ మరుగుదొడ్లు...

టోల్‌ఫీజు చెల్లిస్తూ రాకపోకలు సాగించే వారికి మాత్రం ఎటువంటి సదుపాయాలు లేవు. టోల్ ప్లాజాకు ఇరువైపు ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు, యూరినల్స్ ఏర్పాటు చేయాలి. ఇక్కడ మాత్రం ఒకవైపే ఉన్నాయి. కార్లు, బస్సుల్లో వెళ్లేవారు కాలకృత్యాలు తీర్చుకునేందుకు జాతీయ రహదారిపై ఎక్కడా సదుపాయాలు లేకపోవడంతో టోల్‌ప్లాజాల వద్ద ఈ అవసరాలు తీర్చుకుంటారు. ఇక్కడ మాత్రం తుని నుంచి విశాఖ వైపు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేశారు. అవి కూడా అరకొరగానే ఒకే సారి ఐదుగురు కాలకృత్యాలు చేసుకోవాలంటే ఉగ్గబట్టుకోవాల్సిందే. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో అవి కూడా లేవు. గత యాజమాన్యం మరుగుదొడ్ల కోసం కంటైనర్లను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత యాజమాన్యం వీటి నిర్వాహణను పట్టించుకోకపోవడంతో అవి పాడయ్యాయి. తాగునీటి సదుపాయం అంతంత మాత్రంగానే ఏర్పాటు చేశారు.

అందుబాటులో లేని అంబులెన్స్...

జాతీయ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు టోల్ ప్లాజాల వద్ద అంబులెన్స్ అందుబాటులో ఉండాలి. ఇక్కడ అటువంటి సదుపాయం లేదు. ఉన్న రెండింటికి ప్లాజాకు 40 కిలోమీటర్ల దూరంలో కొక్కిరాపల్లి, అన్నవరం సమీపంలో ఉంచినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగి క్షతగాత్రులు ప్రాణాపాయస్థితిలో ఉంటే అక్కడ నుంచి అంబులెన్స్ రావాలంటే కనీసం గంట సమయం పడుతోంది. రోడ్డు ప్రమాదాల నివారణపై యాజమాన్యం వాహనా చోదకులకు కనీసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. ప్రమాదాలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన 108 వాహనాలే దిక్కవుతున్నాయి. టోల్‌ప్లాజా అంబులెన్స్‌లు ఎప్పుడూ ఉపయోగపడిన దాఖలాలు లేవు.

ప్రయాణికుల అసహనం..

టోల్ బూత్‌ల వద్ద పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల తరచూ వాహనాల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఎక్కువ సమయం టోల్‌ప్లాజా వద్ద వేచి ఉండాల్సి వస్తోందని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల సమయం వృథా అవుతోందని, సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నామని వాపోతున్నారు. పండగ సమయాల్లో దూర ప్రాంతాలకు వెళ్తే వాహనాలు గంటల తరబడి ఉండిపోవాల్సి వస్తోంది. రాత్రిళ్లు ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై విచారించి, కనీస సదుపాయాలు కల్పించాలని, అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బూత్‌ల వద్ద ఒక్క కార్మికుడే విధులు నిర్వహిస్తున్న దృశ్యం


రాజమహేంద్రవరం మార్గంలో పాడైన మరుగుదొడ్లు

రెండో మార్గంలో సదుపాయాలు కల్పిస్తాం...

దీనిపై టోల్‌ప్లాజా మేనేజర్ కృష్ణను వివరణ కోరగా ప్లాజాలో ఫాస్టాగ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎక్కువ సిబ్బంది అవసరం ఉండదన్నారు. ఉన్న సిబ్బందిని కూడా త్వరలోనే తొలగించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 10 బూత్‌లలో 8 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ప్రయాణికుల కోసం ఒక వైపు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రెండోమార్గంలో నిర్మిస్తామన్నారు.

క్లుప్తంగా

గాన గంధర్వుడు ఘంటసాల



ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగభూషణం

అనకాపల్లిటౌన్: అమరగాయకుడు ఘంటసాల 101వ జయంతి వేడుకలను సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నరాజుపేటలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మధుర గానంతో తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన గాన గంధర్వుడు ఘంటసాల అని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, కాలెపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో శ్రీకాకుళంలోని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం గ్రామీణ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భాగస్వామ్య గ్రామీణ అంచనా(పీఆర్ఏ) పద్ధతిలో గ్రామ పటం వేసి పంటలు పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు, వీఏఏ హేమలత, విద్యార్థులు బి.భారతి, టి.స్నేహ. శ్రావణి, ఎస్.సుప్రియ, కె.పుష్పాంజలి, సీహెచ్ మాధురి పాల్గొన్నారు.

నేటి 'వై ఏపీ నీడ్స్ జగన్' వాయిదా

కశింకోట: మండలంలోని సచివాలయాల్లో షెడ్యూల్ మేరకు మంగళవారం జరగాల్సిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం వాయిదాపడినట్లు ఎంపీడీవో వీవీ రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారంనాటి కార్యక్రమాన్ని కూడా వాయిదావేశామన్నారు. జమాదులపాలెంలో జరగాల్సిన కార్యక్రమం మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 4,684 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	3,900	4,370
రెండో రకం	3,780	4,100
మూడో రకం	3,480	3,770

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ : రాజా
కాలింగ్ సహస్ర : సత్యనారాయణస్క్రీన్-1
బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో
విక్రమ్ రాథోడ్ : సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్ : షిర్డిసాయి
కోటబొమ్మాళి : పర్తిసాయి
------- : వెంకటేశ్వర
సౌండ్ పార్టీ : శ్రీసత్య
మంగళవారం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 16 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 278 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 109 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



ఇది కదా అభివృద్ధి

ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె కదలించి యాడు రంగస్థలంబు..

ఇది మరణదూత తీక్షణమౌ దృష్టు లొలయ నవని? బాలించు భస్మసింహాసనంబు..!

చింతల్లేని చివరి మజిలీ

గుర్రం జాషువా కంటే గొప్పగా శ్మశానస్థలి గురించి మరెవరూ చెప్పలేరేమో..! మానవులు తమ జీవితంలో వెళ్లడానికి ఇష్టపడని ప్రదేశాలు రెండు. ఒకటి ఆస్పత్రి, రెండు శ్మశానం. జాతస్య హి ధ్రువో మృత్యుః గీతాకారుడి ఉవాచ. పుట్టిన ప్రతి జీవికీ మరణం తప్పదు. అయితే మరణించినవారికి అంతిమ సంస్కారం గౌరవంగా జరగాలన్నది ప్రతి ఒక్కరి అభి'మతం'. అందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని మతాల శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు.



హిందూ శ్మశానవాటిక ముఖద్వారం

ఆహ్లాదకరంగా శ్మశానవాటికలు | రూ.2.90 కోట్లతో మౌలిక వసతులు



నా పేరు షిర్డి శ్రీనివాస్. శారదానది శ్మశాన వాటిలో కాటికాపరిని. గతంలో ఇక్కడికి శవాల వెంట వచ్చే వారు పడేపాట్లు నాకు తెలుసు. తమ బంధువులను, ఆత్మీయుల్ని కోల్పోయిన బాధలో ఉన్నవారికి శ్మశానంలో కూడా తిప్పలు తప్పేవి కాదు. దహన సంస్కారాల ఏర్పాట్ల కోసం ముందుగా శ్మశానికి వచ్చేవారు కాస్త సేద తీరేందుకు అనువైన ఏర్పాట్లు ఉండేవి కావు. వర్షాలు పడితే వారితోపాటు, నా బాధలు కూడా చెప్పలేనంత. కర్రలు తడవకుండా చూడటం తలకు మించిన భారమయ్యేది. ఇపుడా పరిస్థితి లేదు. శవదహనం ప్రశాంతంగా జరిగేలా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. విద్యుత్ మిషన్‌తో దహన సంస్కారాలు ఈ నెలాఖరు నాటికి మొదలవుతాయని అధికారులు చెప్తున్నారు. అందుకు అవసరమైన భవనాన్ని కూడా నిర్మించారు. ఇక్కడ ప్రజల నమ్మకాల ప్రకారం కర్రలతోనే ఎక్కువగా దహన సంస్కారం జరుగుద్ది. అయితే వర్షాల సమయంలో ఈ కరెంట్ మిషన్ ఎక్కువగా ఉపయోగపడుతుందనుకుంటా.

కేటాయించిన నిధులు

- శారదానది హిందూ శ్మశానవాటిక రూ.1.80 కోట్లు
- సంతబయలు శ్మశానవాటిక రూ.50 లక్షలు
- వల్లూరు, రాజుపాలెం, కొత్తూరు, ఎరుకువానిపాలెం రూ.60 లక్షలు (చెరో రూ.15 లక్షలు)



శారదానది ఒడ్డున క్రిస్టియన్ శ్మశానవాటిక

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ జోనల్ పరిధిలో హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటికల్లో అవసరమైన మౌలిక సదుపాయలకు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. పట్టణ పరిధిలో శారదానది ఒడ్డున హిందూ, క్రిస్టియన్, గవరపాలెం సంతబయలు వద్ద హిందూ శ్మశానవాటికలు ఉండగా, పెరుగుబజారు మసీదువీధిలో ముస్లిం శ్మశానవాటిక ఉంది. వీటన్నింటికీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేసింది.

శారదానది ఒడ్డున ఎలక్ట్రిక్ క్రిమేషన్

శారదానది ఒడ్డున రెండు శ్మశాన వాటికలను రూ.కోటీ 80 లక్షల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో ఎలక్ట్రిక్ క్రిమేషన్‌కు వీలుగా రూ.30 లక్షలతో ప్రత్యేక షెడ్ నిర్మాణం చేపట్టారు. శవ దహన యంత్రం నెలాఖరులోగా వస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇందుకు అవసరమైన విద్యుత్ సరఫరాకు వీలుగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే శ్మశానవాటికలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేశారు. దహన సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా షెడ్లు, నీటి వసతి కల్పించారు. ఆవరణలో రకరకాల మొక్కలు నాటికి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్టియన్ శ్మశానవాటికలో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆహ్లాదకరంగా సంతబయలు శ్మశానవాటిక

పట్టణ జనాభాను దృష్టిలో పెట్టుకుని నాలుగు దశాబ్దాల కిందట గవరపాలెంలో శ్మశానవాటికలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వాటిని పెద్దగా పట్టించుకున్నది లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఈ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు కేటాయించింది. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీగోడతోపాటు, సీసీ రోడ్డును నిర్మించారు. వీటితోపాటు జీవీఎంసీ విలీన గ్రామాలైన రాజుపాలెం, వల్లూరు, ఎరుకువానిపాలెం, కొత్తూరు గ్రామాల్లో శ్మశానవాటికల అభివృద్ధికి రూ.15 లక్షల చొప్పున కేటాయించారు. ఇవి ప్రస్తుతం టెండర్ దశలో ఉన్నాయి.



క్రిస్టియన్ శ్మశానవాటిక



ఎలక్ట్రిక్ క్రిమేషన్ కోసం నూతన భవనం

మెరుగైన సదుపాయాలు



శారదానది ఒడ్డున శ్మశానవాటికలను బాగా అభివృద్ధి చేస్తున్నారు. గతంలో మృతదేహాల వెంట వచ్చేవారు కాసేపు కూర్చునేందుకు నిలువ నీడ ఉండేది కాదు. వర్షాకాలంలో శవదహనమంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇపుడా దుస్థితి లేదు. కూర్చునేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. అస్థికలు భద్రపరిచేందుకు ప్రత్యేక గదిని నిర్మించారు. లోపల సిమెంట్ రోడ్లు వేశారు. వర్షాకాలంలో కూడా ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

– బి.శ్రీను, అనకాపల్లి

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు



చావు ప్రతి ఒక్కరికీ కష్టం కలిగించేదే. అయినవారి అంత్యక్రియలకు వచ్చేవారికి శ్మశానాల్లో చింతల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ అభిమతం. అందుకు అవసరమైన నిధులను కేటాయించడంలో ఎక్కడా జాప్యం చేయట్లేదు. శ్మశానవాటికల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం. ఎక్కడైనా శ్మశానవాటికలో సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే చాలు. వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు వెచ్చించి, తక్షణ చర్యలు తీసుకుంటాం.

– సుర వెంకటరమణ, జెడీసీ, అనకాపల్లి జోన్

శివాలయాలకు పోటెత్తిన భక్తజనం



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అర్చకుల అభిషేకం



కశింకోటలోని శివాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలో శివాలయాలు ఆధ్యాత్మిక భావనలో మునిగితేలాయి. కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా ఊరూవాడా ఆలయాలకు భక్తులు వేకువజాము నుంచే పోటెత్తారు. హరహర మహదేవ.. శంభోశంకర నామస్మరణతో హోరెత్తించారు. చిన్నపాటి వర్షం పడుతున్నప్పటికీ భక్తుల రద్దీ తగ్గలేదు. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయాల్లో శివలింగానికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి, శారదానది ఒడ్డున, గాంధీనగరం ఉమారామలింగేశ్వరస్వామి, చిన్నరాజుపేట సాంబశివుని ఆలయం, కూరగాయల మార్కెట్ సాధువుల ఆలయాల్లో అర్చకులు విశేష పూజలు జరిపారు. సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణ దేవాలయాల్లో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహిళా భక్తులు ధ్వజస్తంభాల వద్ద దీపారాధన చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ చైర్మన్లు, ఈవోలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కశింకోట: మండలంలోని శివాలయాలు కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని భక్తుల రద్దీతో కళకళలాడాయి. స్థానిక పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునే చేరుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కస్పావీధిలోని సాంబశివుని ఆలయం, వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం, చింతలపాలెంలలోని శివాలయాలు, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని సాంబమూర్తి, బసవేశ్వరస్వామి ఆలయాలు, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, అభిషేకాలు నిర్వహించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి రూరల్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా శాఖ రెండో కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షురాలిగా వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొంది చిన్నబ్బాయ్, గౌరవ అధ్యక్షుడిగా నెల్లి సుబ్బారావు, సహాధ్యక్షులుగా కట్టా శ్రీను, పి.గాయత్రి, కోశాధికారిగా జోగా రాజేష్, కార్యదర్శులుగా దొగ్గ శ్రీను, జీఎస్ ప్రకాష్, కళింగ సతీష్, ఎన్.శేషుకుమార్, వి.చైతన్య, వి.రమేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గార రాజబాబు, సభ్యులుగా గేదెల శాంతిదేవి, ఆర్.లక్ష్మణరావు, ఎం.శ్రీను, జి.అప్పలరాజు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులతో అరుణకుమారి ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీకి పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గాలివానతో రైతుల్లో గుబులు



కశింకోట వద్ద గాలివానకు నేరకొరిగిన వరి చేను



కశింకోట పోలీసుస్టేషన్ పక్క రోడ్డుపై వర్షపు నీటి ప్రవాహం

కశింకోట: మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన సమయంలో కురుస్తున్న వర్షంతో నేలకొరిగిన పంట నీట మునిగి, తీవ్ర నష్టం వాటిల్లనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా వీచిన గాలుల వల్ల కొన్నిచోట్ల పంట చేలు నేరకొరిగాయి. తాజా గాలివానతో మరికొన్నిచోట్ల ఏపుగా ఎదిగి కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలాయి. ప్రస్తుతానికి పొట్టి రకం వరి చేలు మాత్రం నిలబడి ఉన్నాయి. రానున్న రోజుల్లో వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణ హెచ్చరికలతో పంటను తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని భయపడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దెబ్బతింటుందంటుని రైతులు వాపోతున్నారు. సోమవారంనాటి వర్షానికి కశింకోట ప్రాంతంలో రోడ్లపై నీరు చేరింది. స్థానిక పోలీసు స్టేషన్ రోడ్డు, కనకమహాలక్ష్మి వీధి రోడ్డు తదితర పల్లపు ప్రాంతాల్లో నీరు భారీగా చేరి, ప్రవాహాలను తలపిస్తున్నాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉండటంతో జన జీవనానికి అంతరాయం ఏర్పడింది.

దూసుకొస్తున్న మిచాంగ్



ముత్యాలమ్మపాలెం తీరంలో కెరటాల ఉధృతి



సురక్షిత ప్రదేశానికి చేర్చిన తెప్పలు

• అప్రమత్తమైన యంత్రాంగం

పరవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో సముద్రం ఉగ్రరూపం దాల్చింది. కెరటాలు మూడు మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి చలి గాలులు బలంగా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేట మానుకున్నారు. తెప్పలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. వలలు, ఇంజిన్లను సామాజిక భవనంలో భద్రపర్చుకున్నారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవడంతో బస్సులు ఖాళీగా దర్శనమిచ్చాయి.

తీర ప్రాంతంలో అధికారుల పర్యటన

తుపాను పరిస్థితులను తెలుసుకోవడానికి తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలను సోమవారం సాయంత్రం సందర్శించారు. తుపాను సమయంలో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయడానికి వీఆర్వో, వీఆర్ఏలను అప్రమత్తం చేశామని చెప్పారు. అత్యవసర సమయంలో తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలన్నారు.



సామాజిక భవనంలో భద్రపర్చిన వలలు

అన్నదాతల హైరానా

సబ్బవరం: పండిన పంట చేతికి వస్తుందనుకున్న దశలో మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో 20.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలంలో మరో 220 ఎకరాల్లో పండిన పంటలను కోతలు కోసి పంట పొలాల్లో కుప్పలు వేసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. రైతులు ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండి అధిక వర్షం కురిస్తే పొలంలో పాయలు తీసుకుని జాగ్రత్త వహించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

షెడ్యూల్ కులాల హక్కులు కాపాడాలి



ఫిర్యాదు కాపీని చూపుతున్న దృశ్యం

మునగపాక : షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌ను దుర్వినియోగం కాకుండా అంగన్‌వాడీ ఆయా పోస్టుకు తనను ఎంపిక చేయాలని కోరుతూ గంగాదేవిపేటకు చెందిన దళిత మహిళ బచ్చల పైడిగున్న సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదు కాపీని విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగాదేవిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసేందుకు ఆయా పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఎస్సీ మాల కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో ఉన్నప్పటికీ ఎటువంటి విచారణ చేయకుండా ఐసీడీఎస్ అధికారులు అర్హులెవరూ లేరంటూ మరో నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. షెడ్యూల్ కులాల హక్కులకు భంగం కలిగించేలా అధికారులు ప్రవర్తించడం బాధాకరమన్నారు. రిజర్వేషన్ ప్రకారం చెందాల్సిన హక్కులను అధికారులు హరించడం విచారకరమన్నారు. ఈ విషయమై తగు విచారణ చేపట్టి తనకు న్యాయం జరిగేలా చూడాలని పైడిగున్న కోరారు.

ఘనంగా వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఎస్.రాయవరం : మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసినప్పటికీ తుపాను కారణంగా వర్షం కురవడంతో ప్రధాన ఆలయ మండపంలో స్వామికి కల్యాణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు దంపతులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు.

బీఎల్వోలు రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలి

మునగపాక: రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌కు సంబంధించిన రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోరంజని తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి బీఎల్‌వోలతో ఆమె సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్‌వోలు ఓటరు నమోదుకోసం వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ ప్రక్రియ వేగవంతమయ్యేలా చూడాలన్నారు. స్థానికంగా ఉండే బీఎల్‌ఏల సహకారం తీసుకొని ఓటరు నమోదుకు సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆనంద భైరవుడిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కార్తీకమాసం మూడో సోమవారం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షవాటిలోని ఆనందభైరవునికి మహామృత్యుంజయ సహిత రుద్రహోమం జరిగింది. 30 ఏళ్ల కిందట శ్రీ విద్య ఉపాసనను ఔపోసనపట్టిన హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన అమృత బిందు సెంటర్ సభ్యులు జి.జానకిరత్నం, ఉమాదేవి, విజయలక్ష్మి తదితరులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హోమాల్లో పాల్గొన్నారు.